# గిరీశంతో కాసేపు ...

సూరంపూడి విశ్వం

రాష్ట్రస్థాయి నాటక పోటీల సందర్భంగా, రవీంద్రభారతిలో ఘనంగా "నంది" అవార్డుల ప్రధానోత్సవం ఏర్పాటయ్యింది. ఆహ్వానాన్ని అందుకుని అనేక మంది ప్రముఖులు విచ్చేశారు. సభాప్రారంభానికి ఇంకా కొంత వ్యవధి వుండటంతో, సభకు విచ్చేసిన వారు అక్కడ అక్కడ చేరి మాటల్లో పడ్డారు.

గురజాడ అప్పారావుగారి గిరీశం, వెంకటేశం, చిలకమర్తి వారి గణపతి, మొక్కపాటి వారి బారిష్టరు పార్వతీశం, మునిమాణిక్యంగారి కాంతం, ఒకచోట చేరి మాట్లాడుకుంటే, ఇలా వుండవచ్చు! అన్న ఊహా కల్పన ఈ పేరడీ! చిత్తగించండి."!

"నమస్కారం గురూగారూ!" జ్ఞాపకం వున్నానా?" అంటూ గిరీశం గారి ప్రక్కనే వచ్చి కూర్చున్నాడు వెంకటేశం. భలేవాడివే! "గుర్తు లేకేం! శిష్యుడిని మర్చిపోతానుటోయ్? అసలు నిన్ను సురేంద్రనాథ్ బెనర్జీ అంతట వాడిని చేస్తానంటే విన్నావుగాదు! అదిసరే! ఎప్పుడో నిన్ను నీ చిన్నతనంలో చూశాను, పొడుగాటి నిక్కరు, చెవుల పోగులతో సన్నగా రివటలా వుండే వాడివి. చిరంజీవి లెవెల్లో తయారయ్యావు స్టైయిల్గా! ఏం చేస్తున్నావేమిటి?"

"ఏం చేస్తాడు? యూనివర్శిటీలో తెలుగు ఎం.ఏ చేస్తున్నాడు. అయినా మీ చేతి నుండి జారిపోవడం మంచిదైందని అగ్నిహోత్రావధాన్లుగారు ఎవరితోనో అన్నార్ట! అన్నారు కాంతంగారు.

గణపతిని చూసి "అవును గాని ఇతనెవరోయ్ వెంకటేశం?" అని ప్రశ్నించారు గిరీశం గారు. వెంటనే, క్షమించాలి! చెప్పడం మర్చిపోయాను." ఇతనిది మా వూరి ప్రక్కనే వున్న కానూరు అగ్రహారం. ఇతని పేరు గణపతి. ఇతని తల్లి సింగమ్మగారు. పాపం! కష్టపడి చదివిస్తున్నారు. నా క్లాస్ మేట్!" అని గణపతిని గిరీశంగారికి పరిచయం చేశాడు, వెంకటేశం.

గణపతి అంటే చిలకమర్తి వారి గణపతివి కదూ! నిన్నూ, నీ అల్లరి గురించి వినడమేగాని, ఇన్నాళ్ళకు చూశాను! అన్నారు బారిష్టరు పార్వతీశంగారు మహదానందంతో!

వెంటనే గిరీశంగారు అందుకున్నారు! అతగాడి అల్లరిలో కూడా అర్థం వుండేది. ఒకసారి బడికి ఎగనామం పెట్టి సరదాగా గాడిద ఎక్కి వూరేగాడు. తల్లి అదేం పని? అని కసురుకుంటే మహచక్కని సమాధానం చెప్పాడు! అన్నారు.

"ఏమని చెప్పాడు!" ప్రశ్నించాడు కాంతంగారు.

"అమ్మా! వసుదేవుడు గాడిద కాళ్ళు మాత్రమే పట్టుకున్నాడు గానీ, నాలాగ ఠీవిగా, దర్జాగా, గాడిద మీద కూర్చోగలిగాడా?" అని.

అంతెందుకు! ఆకాశంలో మనకి కనిపించే ఉరుములు, దేవుడు రథం మీద వెళుతూంటే, ఆ చక్రాల చప్పుడు అని, ఆ చక్రాల రాపిడీకి అప్పుడప్పుడు వచ్చే కాంతి మెరుపులు అని, వర్షం దేవుడి శరీరం మీదున్న చెమటబిందువులు అని, ఒక్కొక్కప్పుడు దేవుడి శరీరం మీద చెమట బిందువులు ఆరిపోవడం చేత, మనకి గాలి వచ్చి వర్షం రాకపోవడం అని, తనకి తోచిన విధంగా తడుము కోకుండా, తోటి పిల్లలకు చెప్పేవాడు, అన్నారు గిరీశంగారు మళ్ళీ!

“నా విషయానికేంగానీండి! మా మామయ్య చెప్పేవాడు. పార్వతీశంగారు “బారెట్లా” చదివేందుకు విదేశాలు వెళ్ళారని, వారితో పాటు, కచికలు, తాటిఆకులు, మరచెంబు, మడతమంచం వగైరాలు కూడా తీసుకు వెళ్ళారని! నిజమేనండీ?” అంటూ అమాయకంగా అడిగాడు గణపతి. అతగాడి మాటలకు అందరూ నవ్వుకున్నారు.

సరిపోయింది! నీ చేదస్తానికేంగానీ, కాంతంగారు మాత్రం తక్కువ తిన్నారా! మొగుడి అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని, ఎంతగడుసుగా మాట్లాడేవారు? అంటున్న పార్వతీశం గారితో, వెంకటేశం అన్నాడు. “దయ చేసి సోదాహారణంగా వివరించండి! విని ఆనందిస్తాం! వీరు కూడా హాస్యంలో చెతురులు అని విన్నాను.” అన్నాడు.

ఒకసారి వారి శ్రీవారు యుద్ధనిధికి అర్థ రూపాయి విరాళం ఇచ్చారుట! ఆ విషయమై కాంతంగారు అనవసరంగా డబ్బెందుకిచ్చారని విసుక్కున్నారుట. దానికి సమాధానంగా ఆయన, బ్రిటిష్ ప్రభుత్వం జర్మని మీద యుద్ధం చేస్తోంది కదా? యుద్ధనిధికి విరాళం ఇచ్చా! అన్నార్ట! ఆ మాటలు విన్న కాంతంగారు భగ్గున మండిపడుతూ “అర్థరూపాయికి గతిలేని వాళ్ళు యుద్ధం ఎందుకు తల పెట్టాలిట?” అన్నారుట! అని ముగించారు బారిష్టరు పార్వతీశంగారు.

మన మాటలకేంగానీ, ఈ శుభదినాన, మనమందరం, గిరీశంగార్ని కలుసుకోవడం చాలా సంతోషించాల్సిన విషయం. అంచేత, సభా ప్రారంభానికి మరి కొంత వ్యవధి వుంది, కనుక గిరీశంగారిని సాహిత్యం గురించి నాలుగు ముక్కలు మాట్లాడని కారణం! అన్నారు కాంతంగారు!

“అవును! గిరీశంగారి సాహిత్యసన్యాసం కావాలి!” అన్నారు మిగిలిన వాళ్ళు

వంత పాడుతూ! “సరే! మీరంతా అలాగ పట్టుబడితే, కాదనేదేముంది ఇహ!” అంటూ గిరీశంగారు మొదలు పెట్టారు!

అన్నట్టు ఆ మధ్య పారిస్‌లో అంతర్జాతీయ, జాతీయ కవులంతా, చేరి సుబ్రహ్మణ్య విలాస్‌లో గ్రాండ్ డిన్నర్ అరేంజ్ చేసుకున్నారు. అఫ్‌కోర్స్! నన్ను కూడా ఆహ్వానించారనుకోండి!

“అలాగ నవ్వి పారేయకండి! అమెరికా, పారిస్, లండన్ లాంటి విదేశాలలో మన వాళ్ళు ఎక్కువగా వుండటం చేత, చాలా హోటళ్ళకు మన తెలుగు దేవుళ్ళ పేర్లే పెడుతున్నారంటే మీరు నమ్మి తీరాల్సిందే! అంతెందుకు? అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లో మన ఏడుకొండలవాడు నిత్యపూజలందుకోవడం లేదూ?”

అఫ్ కోర్స్! ఆ పార్టీకి చాలా మందే వచ్చారనుకోండి. షేక్స్పియర్, నన్నయ్య, తిక్కన, కాళిదాసు, బుచ్చిబాబు, ప్రేమ్ చంద్, తిలక్, శ్రీశ్రీ ఒహళ్ళనేమిటి? చాలా మంది వచ్చారనుకోండి! వాళ్ళంతా మీలాగానే, నోళ్ళు తెరచి, గిరీశంగారూ, ఒక్కటంటే ఒక్క స్పీచ్ ఇవ్వండి! అంటే కాదనలేక పోయాను.

“ఎంచేతనంటే, నేను పూనా డక్కన్ కాలేజీలో చదువుకునే రోజుల్లో - ది ఎలెవన్ కాజస్ ఫర్ ది - డిజనరేషన్ ఆఫ్ ఇండియా గురించి, ఒక్క బిగిని మూడు గంటల సేపు, ఉపన్యాసం ఇస్తే, ప్రొఫెసర్లు డంగయిపోయారంటే నమ్మండి.”

అయినా నాతో మాట్లాడటమే ఓ ఎడ్యుకేషన్. ఆ, నా స్పీచ్‌లో కొటేషన్లు, దప్పళంలో ముక్కల్లాగ తెగదొర్లిపోయాయంటే నమ్మండి. అన్నట్టు తెలుగు సాహిత్యం మీద నేనిచ్చిన ఆ స్పీచ్‌ని, మన ఆకాశవాణి వారు, దూరదర్శన్ వారు, ఇంకా మిగిలిన ఛానల్స్ వారు కూడా ప్రసారం చేశారే?

“అసలు ఇన్నాళ్ళకు మన వాళ్ళు తెలుగు భాషని ప్రాచీన భాషగా గుర్తించుకుని పోరాడుతున్నందుకు చాలా

సంతోషిస్తున్నా! అయినా మన వాళ్ళు చీటికీ మాటికీ ఇంగ్లీషుని పట్టుకు వేళ్ళాడతారు గానీ, తెలుగులో లేదుటండీ? మంచి సాహిత్యం?"

"గురుగారూ! చిన్న సందేహం!" అన్నాడు వెంకటేశం.

"అబ్బ! నువ్వుండవోయ్ వెంకటేశం. పానకంలో పుడకలా, ఇడ్లీలో మినబ్బద్దలా జున్నులో మిరియపు గింజలా అడ్డురాకు! అంటూ మళ్ళీ పుంజుకున్నారు గిరీశంగారు.

"అసలు తరచి చూస్తే, మనకి తెలుగులో ఎంత మంది కవులు లేరు? పద్యకవులూ, గద్య కవులూ, నవ్య కవులూ, భావ కవులూ, ప్రబంధ కవులూ, మొదలైన వాళ్ళు మన సాహిత్యంలో ఎన్నెన్ని పుస్తకాలు లేవూ? దిన, వార, పక్ష, మాసపత్రికలూ

కూడా ఇతోధికంగా సాహితీసేవ చేస్తూనే వున్నాయి. ఎన్నెన్ని నవలలూ, నాటకాలూ? ఏమోయ్! వెంకటేశం? వీటిలో ఒకటయినా చదివిన పాపాన పోయావా? మరి నీలాంటి ప్యూర్ యంగ్ బ్లడ్ ఇలాంటి వాటి మీద శీతకన్నేస్తే ఎలాగోయ్! ఎన్నెన్ని శతకాలు లేవూ? మన తెలుగులో?"

అన్నట్టు శతకం అంటే గుర్తొచ్చింది. మన గణపతి తెలుగులో చిన్నతనంలోనే ఎంత ప్రతిభ చూపించాడో, దాశరథీ శతకంలోని శ్రీరఘురామా .... చారు... అన్న పద్యానికి వివరణ ఇచ్చిన విధానం తెల్సుకుంటే చాలు! అన్నారు గిరీశంగారు!

పోనిద్దురూ! చిన్నతనంలో ఏదీ తెలిస్తే తెలియక వాగాను తోటిపిల్లలతో! అది సరే! మీరు కానివ్వండి! అన్నాడు గణపతి సిగ్గుపడుతూ!

"ఆ పద్యం గురించి అతగాడి వివరణ మాకూ వినిపిస్తే ఆస్వాదించి, ఆనందిస్తాం కదా!" అన్నారు బారిష్టరు పార్వతీశంగారు.

అయితే వినండి! అంటూ వివరించడం మొదలు పెట్టారు కాంతంగారు.

"ఒకసారి శ్రీరాముల వారు పైత్యంగా వుందని చారు కాయించుకున్నారుట. ఆ దేశంలో కరివేపాకు కరవుట. అంచేత తులసీదళాలు వాడారుట వంటవాళ్ళు. అలాంటి చారు సేవించడం వల్ల రాములవారికి శ్రమంతా పోయి శృంగారంగా కూడా వుందిట. దానితో శౌర్యం మరింత పెరిగిందిట. దుర్వార, కబంధ రాక్షసులను సంహరించారుట. కల్మషం హరించి చివరికి భద్రం చేకూరిందిట!" అని ఆగారు కాంతంగారు.

గణపతి వివరించిన విధానానికి అందరూ హాయిగా నవ్వుకున్నారు.

అంతలో గొంతు సవరించుకుని, "వెంకటేశం! లంక పొగాకు కాలిస్తే, క్యాన్సర్ రాదని కదటోయ్ సీమ వాడు కనిపెట్టింది! అంచేత బుద్ధి పని చేసేందుకు, ఒక్కసిగార్ వెలిగించి, విషయంలోకి వస్తాను!" అన్నారు గిరీశంగారు.

పైగా, "వెంకటేశం! మరోలా అనుకోక, నువ్వలాగ వెళ్ళి ఒక అరడజను మంచి లంక పొగాకు సిగార్స్, పట్రావోయ్! అన్నట్లు నా దగ్గర కరెన్సీయేగానీ, కాయిన్స్ లేవు. నీ దగ్గరుంటాయి చూడు!!" అన్నారు!

అంతలో లాల్చీ పైజమా తీసుకున్న ఒక ఆసామి వీరి వద్దకకు వచ్చాడు. బహుశా కార్యవర్గ సభ్యుడు కాబోలు!

"అయ్యా! మరి కొద్ది నిమిషాల్లో కార్యక్రమం మొదలు కాబోతోంది. తామంతా దయ చేసి మీ పనికి రావాల్సిందిగా మనవి చేస్తున్నాను." అంటూ వినయంగా చెప్పి వెళ్ళిపోయాడు.

"అందరం మళ్ళీ త్వరలో మరోసారి కలుద్దాం! పదండి! లోపలికి వెళ్దాం!" అంటూ లేచారు గిరీశంగారు.

॥ సమాప్తం ॥